ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప జిల్లా వార్తలు
5
బుధవారం 24 జూలై 2024

కుందూ విస్తరణలో తీసిన మట్టిని ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు లోడ్ చేస్తున్న దృశ్యం



- విస్తరణ కోసం తీసిన మట్టికట్టలు మాయం
- ఎక్సకవేటర్లు పెట్టి టిప్పర్లలో అక్రమ రవాణా
- ప్రభుత్వం మారినా మారని మాఫియా
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కుందూలో మట్టి దోపిడీ

ప్రొద్దుటూరు, జూలై 23: వైసీపీ ప్రభుత్వంలో పెన్నా, కుందూ నదులలో ఇసుక, మట్టి అందినకాడికి దోచుకున్నారు. ముఖ్యంగా కుందూ నది విస్తరణ పేరిట మూడేళ్లుగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కుందూ పరివాహ ప్రాంతంలో ఇసుక, మట్టి తవ్వకాలు జరిపి వేలాది టిప్పర్లతో అక్రమంగా తరలించి కోట్ల రూపాయలు వైసీపీ నేతలు జేబుల్లో వేసుకున్నారు. కుందూ నది విస్తరణలో భాగంగా నది అంచున మట్టి కట్టలు పోశారు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో వారే మట్టిని ప్రైవేటు లేఅవుట్‌లకు తోలి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో కొద్ది నెలలుగా కుందూ విస్తరణ పనులు నిలిచిపోయాయి.

మట్టి దోపిడీపై చర్యలు తీసుకుంటాం..

కుందూలో విస్తరణ పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. దాదాపు రెండు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు రూ.25 కోట్ల మేర కుందూలో తవ్వకాల పనులు చేపట్టారు. కుందూలో ఇప్పటికే మట్టి చాలా మాయం అయింది. మట్టికట్టలు కూడా తరలించారు. మట్టికట్టల్లో మట్టిని తరలించడంపై చర్యలు తీసుకుంటాం.

- బ్రహ్మానందరెడ్డి, డీఈ, తెలుగుగంగ ప్రాజెక్టు

కూటమి వచ్చినా ఆగని మట్టిదోపిడీ

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నదులలో సాగే ఇసుక, మట్టి దోపిడీని అరికడతారని నమ్మి ప్రజలు కూటమికి ఓట్లేశారు. కానీ ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇంకా ఎక్కడా నదులల్లో ఇసుక, మట్టి దోపిడీ ఆగటం లేదు. ఇందుకు నిదర్శనం కామనూరు వద్ద బ్రిడ్జి కింద కుందూ నదిలో విస్తరణ సందర్భంగా తీసిన మట్టిను అక్రమంగా ఎక్సకవేటర్లను పెట్టి టిప్పర్లలో తరలించడమే. ఇది సాక్షాత్తు టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామం కావడం విశేషం. ఇక్కడ మట్టి తరలింపులో అధికారపార్టీకి చెందిన వ్యక్తులే కీలకంగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. పోలీసులు ఈ అక్రమ రవాణాను అడ్డుకుంటే.. వైసీపీ ప్రభుత్వంలో అడ్డుకున్నారా ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రశ్నించినట్లు కొందరు డిపార్ట్‌మెంటు వ్యక్తులు వాపోతున్నారు.

రూ.1200 కోట్లతో కుందూ నది విస్తరణ

కుందూ నదిని 0-186 కి.మీ విస్తరించేకుందుకు రూ.1200 కోట్లతో గత వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టింది. ఇది బనకచర్ల క్రాస్ దగ్గర నుంచి మొదలుకుని పెన్నానదిలో కుందూనది కలిసే వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె వరకు సాగుతుంది. దాదాపు ఇప్పటికి రూ.100 కోట్ల మేర పనులు జరిగాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గం రాజుపాళెం, ప్రొద్దుటూరు మండలాల్లో కుందూ పారే ప్రాంతంలో విస్తరణ పనులను ప్యాకేజీలుగా చేపట్టారు. దాదాపు ప్రొద్దుటూరు నియోజకవర్గంతో పాటు మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలంలో అల్లాడుపల్లె వరకు ఈ పనులు చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో రూ.25 కో మేర పనులు చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే కుందూ విస్తరణ పనులకు సంబంధించి ఒక్క పైసా బిల్లు కాలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లే బిల్లులు రావని భావించి స్వయంగా కుందూలో తవ్విన మట్టిని, ఇసుకను అక్రమంగా టిప్పర్లలో ప్రైవేటు వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకున్నారనే ఆరోపణలున్నాయి. కుందూ నదిలో విస్తరణ పేరిట సాగుతున్న మట్టి దోపిడీ గురించి ఇరిగేషన్ అధికారులకు తెలుసు. కానీ ఈ పనుల్లో కాంట్రాక్టరుకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో.. మట్టి అక్రమ తరలింపును అధికారులు అడ్డుకోవడం లేదని ప్రచారం సాగుతోంది.

విస్తరణను వ్యతిరేకించిన రైతుసంఘాలు

కుందూ నదిని విస్తరణను రైతుసంఘాలు వ్యతిరేకించాయి. వేలాది మంది కుందూ తీరం వెంబడి మోటార్లు వేసుకుని పంటలు పండించుకుంటున్నారని నది విస్తరణతో వీరంతా నష్టపోతారని రైతులు పేర్కొన్నారు. నదిని లోతుగా తవ్వడం వలన సహజంగా వెళ్లే పశువులు నదిలోకి వెళ్లలేవని పర్యావరణం దెబ్బతింటుందని చెప్పినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టి విస్తరణ పేరిట కుందూలో ఇసుక, మట్టి దోపిడీ సాగించింది.



ప్రొద్దుటూరు - దువ్వూరు రోడ్డులో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్లు

రక్తదానం చేస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్



రక్తదానం పుణ్యకార్యం : కలెక్టర్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 23: రక్తదానం మహత్తర పుణ్యకార్యమని ఇది ప్రాణదానంతో సమానమని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. మంగళవారం రక్తదాన వారోత్సవాల్లో భాగంగా రిమ్స్ ఆసుపత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తదాన కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదట కలెక్టర్ రక్తదానం చేశారు. అనంతరం బ్లడ్‌బ్యాంకులో రక్తసేకరణ ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపద సమయాల్లో చుక్క రక్తపు బొట్టు కూడా వెల కట్టలేనంత విలువైనదన్నారు. రక్తదాన వారోత్సవాల్లో భాగంగా 300 మందికి పైగా వైద్యులు, వైద్యసిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. 36సార్లు రక్తదానం చేసిన పెథాలజీ వైద్యసిబ్బంది కె.విజయకుమార్‌కు ప్రశంసాపత్రం అందించి అభినందించారు. 18 ఏళ్లు నిండినప్పటి నుంచి 62 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. ప్రతి వ్యక్తి సంవత్సరానికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చని 42 సంవత్సరాల కాలంలో 160 సార్లు రక్తదానం చేయడం ద్వారా 160 మంది ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేశ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ సురేశ్వర్‌రెడ్డి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి తదతరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచండి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 23: జిల్లాలోని ఆసుపత్రుల్లో సౌకర్యాలను పెంచాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పారామెడికల్ సిబ్బంది నియామక నోటిఫికేషన్, కడప జీజీహెచ్, క్యాన్సర్ కేర్ సెంటర్, జిల్లా ఆసుపత్రి ప్రొద్దుటూరు, పులివెందుల ఆసుపత్రుల్లో సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో వినాయకచవితి ఉత్సవాలపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరులో జరిగే గణేశ్ ఉత్సవాల నిర్వహణకు మట్టి విగ్రహాలను వినియోగించుకొనేలా అవగాహన పెంచాలన్నారు. పీఓపీ విగ్రహాల తయారీని అరికట్టాలన్నారు. మట్టి బొమ్మలను తయారు చేసి అమ్మకాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సుధాకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఫైర్ అధికారి ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు ఘన వీడ్కోలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 23: కడప కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌కు అధికారులు, మున్సిపల్ కార్మికులు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన ఆయనకు పూలజల్లులతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప అభివృద్ధిలో తనకు భాగస్వామ్యం కల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కడపలో పనిచేయడం చాలా సంతోషం ఇచ్చిందన్నారు. మున్సిపల్ కార్మికుల కృషి, సేవలు జీవితంలో మరువలేనన్నారు. ఎక్కడ ఉన్నా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.



కమిషనర్ ప్రవీణ్‌చంద్‌పై పూలవర్షం కురిపిస్తున్న మున్సిపల్ కార్మికులు, అధికారులు

ఇడుపులపాయలో 860 మందికి అడ్మిషన్లు

- మిగిలిన సీట్లకు ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్

వేంపల్లె, జూలై 23: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో సమీకృత ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించిన మొదటి విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ మంగళవారం ముగిసింది. రెండు రోజుల పాటు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. 1040 మందికి ఇడుపులపాయలో చేరాలని కాల్‌లెటర్లు పంపగా సోమ, మంగళవారాల్లో 860మంది అడ్మిషన్లు పొందారు. రెండో రోజు కౌన్సెలింగ్‌ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సంద్ర, డైరెక్టర్ గుప్త పర్యవేక్షించారు. మిగిలిన 180 సీట్లకు ఆగస్టు మొదటి వారంలో రెండో విడత కౌన్సెలింగ్ ఉంటుందని, మెరిట్ జాబితాను త్వరలోనే విడుదల చేస్తామని అన్నారు.

నూజివీడులో రెండురోజుల పాటు కౌన్సెలింగ్ జరిగిందని 1050 మందికి కాల్ లెటర్లు పంపగా 883 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారన్నారు. 167సీట్లు మిగలగా వీటిని ఆగస్టు మొదటి వారంలో భర్తీ చేయనున్నట్లు కన్వీనర్ అమరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్, డీన్‌లు రత్నకుమారి, బిన్ని, కోటేశ్వరి, పీఆర్వో తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇడుపులపాయలో కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న వీసీ విజయ్‌కుమార్

పుష్పం.. పత్రం.. సమర్పయామి

- వైభవంగా పుష్పయాగం
- ముగిసిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 23: జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. ద్వాదశ రాధనలో భాగంగా 12 రకాల నైవేద్యాలు, వివిధ రకాల పుష్పాలను మేళతాళాలు, డప్పుల వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ వేదికమీద ప్రత్యేక అలంకరణలో ఆశీనులైన ఉత్సవమూర్తుల వద్దకు తీసుకువచ్చారు. టీటీడీ వేదపారాయణులు, ఆలయ అర్చకులు సునీల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సాయికృష్ణ శర్మ, సుమంత్‌శర్మ, పార్థు స్వామి ఆధ్వర్యంలో పుష్పయాగం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, టీటీడీ విజిలెన్స్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

కడప (క్రైం), జూలై 23: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్ట వ్యతిరేకమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు జిల్లాలోని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలను పోలీసు అధికారులు, సిబ్బంది గుర్తించారు. వీటిని పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల సిబ్బంది సహకారంతో శుభ్రం చేయించి మద్యం సేవించేందుకు వీల్లేకుండా యుద్ధప్రాతిపదికన పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు.



శుభ్రం చేయిస్తున్న దృశ్యం

కడప ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల ఏర్పాటు

కడప (క్రైం), జూలై 23: కడప ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల్లో మంగళవారం లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వన్‌టౌన్ పోలీసులు ఏర్పాటు చేశారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఘటనతో అప్రమత్తమయ్యారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతాచర్యల్లో భాగంగా ఈ కెమెరాలను అమర్చారు. ప్రతిరోజూ రాత్రి ఈ రెండు కార్యాలయాల్లో సిబ్బంది విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో పోలీసులు వీటిని ఆన్ చేస్తారు. ఎవరైనా కార్యాలయాల లోపలికి వెళితే ఆ దృశ్యాలను రికార్డు చేసి సైరన్ మోగుతుంది. దీంతో పోలీసులు నిమిషాల్లోనే అక్కడికి వెళ్లి ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

మదనపల్లెలోనే అధికారుల మకాం

- మిస్టరీ మంటలపై పోలీసుల విచారణ
- సీఐడీ అదుపులో గౌతమ్‌తేజ్, మరో ఉద్యోగి
- కాలిన పత్రాలు కట్టలు..సీజ్, పంచనామా
- పెద్దిరెడ్డి బినామీ మాధవరెడ్డి ఇంట్లో సోదాలు
- ఆర్డీవోలతో పాటు ఉద్యోగులనూ విచారించిన బృందం

మదనపల్లె, జూలై 23: మదనపల్లెలో జరిగిన మిస్టరీ మంటలపై రెండోరోజు మంగళవారం కూడా విచారణ కొనసాగింది. సీఐడీ, పోలీసు, ట్రాన్స్‌కో విభాగాల అధిపతులు మదనపల్లెలోనే మకాం వేశారు. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సబ్‌కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌తో పాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బినామీ, వైసీపీ నాయకుడు వి.మాధవరెడ్డిని విచారించారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులను విడతల వారీగా సీఐడీ, సివిల్ పోలీసులు విచారిస్తున్నారు. అలాగే కార్యాలయంలో అగ్నికి ఆహుతైన కీలకమైన రెవెన్యూ రికార్డులను పరిశీలించిన పోలీసు, సీఐడీ అధికారులు..పాక్షికంగా కాలిన ఫైళ్లను సేకరించి కట్టలు కడుతున్నారు. ఈ ఫైళ్లు ఏ మండలం, ఏ అంశానికి సంబంధించినవో ఆర్‌వోసీ నెంబర్‌తో సహా నమోదు చేసి వీఆర్వోల సమక్షంలో పంచనామా నిర్వహించారు. అలాగే ఆర్డీవోలు ఎం.ఎస్.మురళి, హరిప్రసాద్‌లను తమ అదుపులోనే ఉంచుకున్న పోలీసు, సీఐడీలు విడతల వారీగా విచారించి అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారు. మరోవైపు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉదయం నుంచి ఇక్కడే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. అలాగే చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ఇదీ రెండోరోజు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అదే వేడి, అదే హడావుడి కనిపించింది.

అగ్నికీలల్లో ఆహుతైన కీలకమైన విభాగాన్ని చూసే సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, ఆయన సహచర ఉద్యోగి భరత్‌ను సీఐడీ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకూ విచారించారు. ఆదివారం రాత్రి గౌతమ్‌తేజ్‌తో పాటు భరత్ కూడా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్నట్లు సమాచారం రావడంతో విచారించినట్లు చెబుతున్నారు. మరోవైపు వీరిద్దరూ కూడా ఒకే రూమ్‌లో ఉంటూ విధులకు హాజరవుతుండటం కూడా సీఐడీ విచారణకు దారి తీసింది. అలాగే ఆర్డీవో ఎం.ఎస్.మురళి రెండు రోజులుగా పోలీసుల అదుపులో ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఆయనను కూడా అటు పోలీసులు, ఇటు సీఐడీ పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నట్లు సమాచారం. అలాగే ఆర్డీవో హరిప్రసాద్‌ను కూడా విచారిస్తున్నారు. పెద్దిరెడ్డి అనుచరుడిగా చెబుతున్న రైస్‌మిల్లు మాధవరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా స్థానిక రెడ్డీస్ కాలనీలోని ఆయన నివాసంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పోలీసులు వీఆర్వోలు, వీఆర్‌ఏలతో కలసి సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కీలకమైన భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రెండు సంచుల మేర ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. డాక్యుమెంట్లు, రికార్డులను నమోదు చేసి వీఆర్వోల చేత పంచనామా చేయించారు. మాధవరెడ్డి అందుబాటులో లేకపోవడంతో సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగుల విచారణ

కార్యాలయంలో పనిచేసే అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని సీఐడీ, పోలీసులు మంగళవారం విచారించారు. ఇద్దరు ముగ్గురిని బృందంగా ఏర్పాటు చేసి కార్యాలయంతో పాటు డీఎస్పీ, తాలూకా స్టేషన్‌కు తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు టీమ్‌లుగా విచారించారు. ఈ క్రమంలో తాలూకా పోలీస్‌స్టేషన్, డీఎస్పీ బంగ్లాలో ఉద్యోగులు నిరీక్షించారు. అలాగే మదనపల్లె మండలంలోని వీఆర్వోలను టీమ్‌లుగా ఏర్పాటు చేసి కార్యాలయంలో పాక్షికంగా కాలిన రెవెన్యూ రికార్డులు, డాక్యుమెంట్లు, రికార్డులు, కంప్యూటర్లను కట్టలుగా కట్టి సీజ్ చేశారు. విభాగాల వారీగా వేరు చేసి, ఆ ఫైలు ఏ మండలం నుంచి వచ్చిందో ఏ అంశానికి సంబంధించిదో తెలిపేలా ఆర్‌వోసీ నెంబర్ నమోదు చేసి పంచనామా చేశారు.

పరిశీలించిన రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

మదనపల్లె సబ్ కలెక్టరేట్‌ను రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా పరిశీలించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలసి అగ్నిప్రమాదం జరిగిన భవనాలతో పాటు, సబ్ కలెక్టర్ ఆవరణలోని ప్రాంతాలను తనిఖీ చేశారు. 22-ఏ విభాగంలో కాలిపోయి మిగిలిన ఫైళ్లను పరిశీలించారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన సంఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని ప్రమాదానికి గల కారణాలను త్వరగా గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా.. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

ప్రమాద ఘటనపై కొత్త సబ్ కలెక్టర్ ఆరా

కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. అన్నమయ్య కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో పాటు చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు సునీత్‌కుమార్, వెంకటేశ్వర్లు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇక్కడే ఉన్నారు. వీరితో పాటు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు, మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐలు ఉన్నారు.

పోలీసుల అదుపులో సీసీ మణి

సబ్‌కలెక్టర్ కార్యాలయ క్యాంపు క్లర్క్(సీసీ) మణి, ఎలక్షన్ విభాగం చూసే అస్లాంబాషాను కూడా డీఎస్పీ తాలూకా స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. ఔట్‌సోర్సింగ్ విభాగం నుంచి వచ్చిన మణి కంప్యూటర్ విభాగానికి ఇన్‌చార్జిగా ఉన్నాడు. అయితే కొన్నేళ్లుగా సబ్‌కలెక్టర్, ఆర్డీవోలకు సీసీగా కొనసాగుతున్నాడు. అయితే మాజీ మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం పుంగనూరుకు చెందిన వ్యక్తి కావడంతో పాటు కొన్నేళ్లుగా సీసీగా ఉండటం పైగా కాలిపోయిన కంప్యూటర్ సెక్షన్ విభాగానికి ఇన్‌చార్జిగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ కోణంలోనూ మణిని సీఐడీతో పాటు పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎలక్షన్ ఫైళ్లూ అగ్నికి ఆహుతి

రెవెన్యూ విభాగంలోని 22ఏ, ఎన్‌వోసీ, ఆర్‌వోఆర్ ఫైళ్లతో పాటు ఎలక్షన్ విభాగానికి సంబంధించిన ఫైళ్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. రెవెన్యూ విభాగానికి ఆనుకుని ఉండటంతో ఎలక్షన్లకు సంబంధించిన లెక్కాపక్కా రికార్డులన్నీ బూడిదైనట్లు చెబుతున్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె మున్సిపాలిటీ, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు సంబంధించిన ఎన్నికల జమా, ఖర్చులు ఇందులో ఉన్నాయి. అలాగే ప్రభుత్వం నుంచి విడతల వారీగా ఎంత డబ్బులు వచ్చింది..ఇంకా ఎంత రావాల్సి వుంది..ఇప్పుడు వచ్చిన డబ్బులు ఎవరెవరు ఏయే విభాగాల ఉద్యోగులకు ఇచ్చారనే వివరాలు ఉన్నట్లు తెలిసింది. మరోవైపు ప్రభుత్వం నుంచి మూడు విడతలుగా రూ.1.70 కోట్లు రాగా, మరో రూ.2 కోట్లు రావాలని బిల్లులు సిద్ధం చేశారు. మొత్తం మూడు పద్దుల కింద ఎంతెంత రావాలో నమోదు చేశారు. అలాగే ఎవరెవరికి ఎంత బకాయి ఉందో, తదితర వివరాలు ఈ విభాగంలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఎన్నికల విధుల సొమ్ములు ఇవ్వలేదని, టీఏ, డీఏ ఇవ్వలేదని ఉద్యోగులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రెవెన్యూ రికార్డులతో పాటు ఇవి కూడా కాలిపోవడంతో ఆ విభాగాన్ని చూస్తున్న అస్లాంబాషాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



కార్యాలయం ఆవరణలో ఆర్డీవో హరిప్రసాద్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

అక్రమ లేఅవుట్లపై కొరడా

● అనధికార లేఅవుట్లలో రాళ్ల తొలగింపు ● ప్లాట్లు కొన్నవారిలో భయాందోళన
● ప్రభుత్వ జీవో ప్రకారం అన్నింటిని తొలగిస్తాం.. అధికారుల వెల్లడి


అనధికార లేఅవుట్లలో రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జూలై 23: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమలేఅవుట్స్‌పై దృష్టి పెట్టి చర్యలకు ఉపక్రమించింది. నెల్లూరు, కడప జిల్లాలో 2019-2024 మధ్యలో భారీగా అక్రమ లేఅవుట్స్ వేశారన్న ఫిర్యాదులపై చంద్రబాబు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం జీవో విడుదల చేసింది. దీని ప్రకారం రెండు జిల్లాలకు చెందిన అధికారులు వీటిపై చర్యలకు ఉపక్రమించి.. తొలగించే కార్యక్రమం చేపట్టారు.

జిల్లాలో డీటీసీపీ క్రిష్ణసింగ్ ఆధ్వర్యంలో ముందుగా అన్ని మున్సిపాలిటీలు, నగరపంచాయతీల్లో వేసిన వాటిపై కొరడా ఝుళిపిస్తున్నారు. అలాగే పల్లెల్లో వేసిన లేఅవుట్స్ కూడా పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నారు. ఎర్రగుంట్లలో 2019-2024మధ్యలో 12 లేఅవుట్స్ ఉన్న ట్లుగా అధికారులు గుర్తించారు. ప్లాట్లకు నాటిన నెంబర్ రాళ్లను అధికా రులు పోలీసుల పర్యవేక్షణలో తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు 9లేఅవు ట్స్‌లో ఉన్న సుమారు 300లకు పైబడి ప్లాట్లకు సంబంధించిన రాళ్లను తొలగించారు. అనధికారికంగా వేసిన 12లేఅవుట్స్‌లో సుమారు 560 ప్లాట్లు రిజిష్ట్రేన్లు జరిగినట్లు సమాచారం. వీటిలో సుమారు 60 ఇళ్ల నిర్మించారు. అయితే వీటి జోలికి అధికారులు వెళ్లలేదు. ఇందులో కొన్నింటికి అప్రూవల్స్ ఉన్నాయి. కొన్ని కమర్షియల్ కాంప్లెక్స్ కూడా ఉండ టం గమనార్హం. వీటికి అధికారులు 14శాతం ఖాళీ స్థలం విలువ, పీనలైజేషన్ చార్జెస్ (ఏరియా మార్కెట్ విలువను బట్టి), కాంపౌండింగ్ చార్జెస్‌తోపాటు ఇతర ఫీజులను కూడా కట్టించుకుని వాటికి పన్నులు కూడా వేశారు. చాలా వాటికి ఇప్పటికీ అప్రూవల్స్ లేవు, పన్నులు వేయలేదు.

నిబంధనలు పాటించలేదు

ఎర్రగుంట్లలో 2019 నుంచి వేసిన 12 లేఅవుట్స్‌కు ఎవరూ అప్రూవల్స్ తీసుకోలేదు. లేఅవుట్‌కి సంబంధించి ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం) ప్రకారం 30అడుగుల దారి వుండాలి. అప్రోచ్‌రోడ్డు 40 అడుగులు ఉండాలి. దాని ప్రకారం ఎవరైనా లేఅవుట్ (వెంచర్) వేయాలంటే 14శాతం ఖాళీ స్థలం (పార్కులు, టెంపుల్స్, బడిగాని) వదలాలి. అయితే చాలా లేఅవుట్స్‌లో 30 అడుగుల రస్తా, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించారు. కానీ 14శాతం ఖాళీ స్థలాన్ని ప్రభు త్వానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కేవలం ల్యాండ్ కన్వర్షన్ తీసుకుని ప్లాట్లు వేసి అమ్మారు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి లేఅవుట్స్‌లో ప్లాట్లు కొన్న యజమానులు ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. లేఅవుట్స్ వేసిన వారికి ఫోన్లు చేసి ప్రశ్నిస్తున్నారు. వారు సరైన సమాధానం చెప్పలేక ఫోన్లు స్విచ్ఆఫ్ చేసుకుంటున్నారు.

ఐదేళ్లుగా పట్టించుకోని అధికారులు

గత ఐదేళ్లుగా కళ్లెదుటే లేఅవుట్స్ వేసి.. ఇళ్లు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గతంలోనే కఠిన చర్యలు తీసుకుని వుంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్న విమర్శలున్నాయి. కొందరు అధికారులు అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో కేవలం తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి మమ అనిపించారు. దీంతో విచ్చలవిడిగా లేఅవుట్స్ వేశారనే విమర్శలున్నాయి. కాగా, మంగళవారం కూడా లేఅవుట్స్‌లో రాళ్ల తొలగింపు కార్యక్రమాన్ని డీటీసీపీ క్రిష్ణసింగ్ చేపట్టారు. అనధికార లేఅవుట్స్‌లో ప్లాట్ల హద్దుల రాళ్లను తొలగించడంపై టీడీపీ నాయకులు జమ్మలమడుగు నియోజకవర్గం ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డిని కలిశారు. జరుగుతున్న నష్టాన్ని వారు ఆయనకు వివరించారు.

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తున్నాం

ప్రభుత్వం ఆదేశాలను అమలు చేస్తున్నాం. అనుమతులు లేని లేఅవుట్లకు గతంలో నోటీసులు ఇచ్చాము. దాని ప్రకారం ప్లాట్ల హద్దులకు ఏర్పాటు చేసిన రాళ్లను తొలగిస్తున్నాం. అయితే ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. వాటిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుం టాము. అన్నింటిని తప్పనిసరిగా రెగ్యులరైజ్ చేయించుకోవాల్సిందే.

-రామక్రిష్ణయ్య, కమిషనర్, ఎర్రగుంట్ల.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యా బోధన చేయాలి : డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్‌రెడ్డి

గాలివీడు, జూలై 23: విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యార్థులకు విద్యాబోధన చేయాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా మొదట గేటు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సందర్శించి అకడమిక్ సంబంధించిన విషయాలను పరిశీలించారు. తర్వాత బాలుర ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ తరగతి గదిని పరిశీలించి విద్యార్థులకు కిట్స్ అందజేస్తామని... పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇస్తామని ఆయన తెలియజేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి అకడమిక్ పరంగా తగు సూచనలు ఇచ్చారు. గుర్రాలమిట్టలో ఉన్న కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి.. విద్యార్థులను ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. తర్వాత కేజీబీవీ ఎస్‌వో, సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థినులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డయేరియా సీజనల్ జబ్బులకు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని ఎస్‌వోకు తెలియజే శారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నాగరాజ్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తనిఖీ



పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కడప డీఈవో అనురాధ

సిద్దవటం, జూలై 23: సిద్దవటం జడ్పీ హైస్కూల్ మంగళవారం కడప డీఈవో అనురాధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి.. పాఠశాలలో జరిగే 'శిక్ష సప్తాహ్' రెండో రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం తదితర విషయాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బోధన సిబ్బందిని ప్రశ్నించారు. విధులకు గైర్హాజరైన సిబ్బంది సెలవు చీటీలను పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత శాతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల పరిసరాల పరిశుభ్రతను, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత మీద ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. పిల్లలకు చదువుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్నా భోజన వంట గదిని, పరిసరాలను పరిశీలించి.. భోజన రుచి చేశారు. టాయిలెట్స్ పరిశీలించి. శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

80 జామచెట్లు అగ్నికి ఆహుతి

చాపాడు, జూలై 23: మండలంలోని పల్లవోలు గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 80 జామచెట్లు కాలిపోయాయి. గ్రామస్థుల సమాచారం మేరకు... పల్లవోలు గ్రామ సమీపంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద 11 కేవీ విద్యుత్తు వైర్లు తెగి.. స్తంభాల మీద పడటంతో నిప్పులు రాలి కింద పడ్డాయి. అక్కడ ఉన్న జామచెట్లు చుట్టూ ఎండిన గడ్డి ఉండడంతో ఆ మంటలు పొలం అంతా అంటుకున్నాయి. దీంతో జామచెట్లు కాలిపోయాయి. గత మూడేళ్ల నుంచి ఈ జామచెట్లు పెంచుకుంటున్నారు. ఈ జామ చెట్లు పక్కనున్న కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమానికి చెందినవి. ప్రొద్దుటూరులోని అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

సుండుపల్లె వాసికి జీవిత ఖైదు


ఆనంద్ (ఫైల్ ఫోటో)

సుండుపల్లె, జూలై 23: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు సుండుపల్లె ఎస్ఐ ఎస్ కేయం హుస్సేన్ తెలిపారు. వివరాలిలా.. సుండుపల్లె మండలం పెద్దపల్లెకు చెందిన నంద్యాల ఆనంద్ (42) తన భార్య నందాల ధనలక్ష్మిని 2004 సంవత్సరంలో హత్య చేశాడు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం పూర్వపరాలు విచారించి... నిందితుడు ఆనంద్‌కు జీవిత ఖైదు విధిస్తూ రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలియజేశారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

చక్రాయపేట, జూలై 23: మండలంలో ఓ మైనర్ బాలికను అత్యాచారం చేసిన నిందితుడికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ కడప జువైనల్ జస్టిస్ బోర్డు చైర్మన్ జడ్జి నందిని తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. 2012లో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు కాగా.. అప్పటి పులివెందుల ఎస్‌డీపీఓ శ్రీనివాసులు కేసు విచారణ చేశారు. ప్రస్తుత పులివెందుల ఎస్‌డీపీఓ కేఎస్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో కోర్టులో ప్రవేశపెట్టగా శిక్ష విధించినట్లు తెలిపారు. నిందితుడిని సంస్కరించడానికి అబ్జర్వేషన్ హోంకు పంపించినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మైలవరం, జూలై 23: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తుండగా గుర్తించిన సిబ్బంది ఆమెను రక్షించి పోలీసులకు అప్పగించారు. దొమ్మర నంద్యాల గ్రామానికి చెందిన అంజనమ్మకు ఇద్దరు పిల్లలుండగా, ప్రస్తుతం ఆమె గర్భిణి. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇద్దరు పిల్లలతో సహా మైలవరం జలాశయం గేట్ల వైపు వెళుతున్న విషయం గమనించిన లష్కర్లు ఆమెను అడ్డుకున్నారు. ఆమె ద్వారా విషయం తెలుసుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ రెడ్డి సురేష్ బాధితురాలిని విచారణ చేస్తున్నారు.

రైలునుంచి కింద పడి బాలుడికి గాయాలు

వల్లూరు, జూలై 23: వల్లూరు మండలం తప్పెట్ల గ్రామ సమీపంలో డెమో రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి నాలుగేళ్ల బాలుడు హుసేన్‌కు గాయాలైనట్లు కమలాపురం రైల్వే పోలీసు అధికారులు తెలిపారు. బాలుడి తల్లికి మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రాథమిక సమాచారం. గాయపడ్డ బాలుడిని కమలాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. ప్రథమ చికిత్స నిర్వహించి కడప రిమ్స్‌కు 108 ద్వారా తరలించినట్లు తెలిపారు.

బండారు అరుణాచలం మృతి


బండారు అరుణాచలం (ఫైల్)

కడప (ఎడ్యుకేషన్) జూలై 23: కడప నగరం విద్యామందిర్ పాఠశాల సమీపంలో ఉంటున్న మాజీమంత్రి బండారు రత్నసభాపతి రెండో కుమారుడు బండారు అరుణాచలం (67) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అరుణాచలం భౌతిక కాయాన్ని టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ నేతలతో పాటు వివిధ రాజకీయ నాయకులు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలు, నగర ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవునికడప రోడ్డు హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్లు.. అతని బావమరిది శ్రీహరి ఐరన్ మార్ట్ అధినేత వడ్ల శ్రీనివాస్ తెలిపారు.

ప్రజల సహకారంతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

పులివెందుల టౌన్, జూలై 23: ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలు నివారించలేమని కడప విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. మంగళవారం తొండూరు మండలంలోని మల్లేల సబ్‌స్టేషన్‌తో పాటు పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా తిరిగి పరిశీలించారు. అనంతరం తొండూరు, సింహాద్రిపురం మండలాల అధికారులు, సిబ్బందితో తొండూరు విద్యుత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. లూజు లైన్లను, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ద ప్రాతిపదికన తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికశాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే సంభవిస్తున్నాయన్నారు. అప్రమత్తతతో ప్రమాదాలు నివారించాలని తెలిపారు. విద్యుత్ పనులు చేసేటపుడు భద్రత నియమాలు పాటించాలని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేయాలన్నారు. లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్‌పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల ఈఈ శ్రీనివాసులు, డీఈఈ జయసుధాకర్‌రెడ్డి, ఏఈఈ రమేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడుకు చెందిన చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్ట్


దొంగల వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి అర్బన్ పోలీసులు

రాయచోటిటౌన్, జూలై 23: పలు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన స్నాచింగ్ గ్యాంగ్‌ను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన గ్యాంగ్‌కు సంబంధించిన వివరాలను రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ మీడియాకు వెల్లడించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు పర్యవేక్షణలో రాయచోటి పట్టణ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... రాయచోటి పట్టణంలోని కొత్తపేట రోడ్డులో గల హనుమాన్ జంక్షన్ వద్ద భాగ్యలక్ష్మి అనే మహిళ వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌లో వచ్చి మహిళ మెడలో ఉన్న చైన్‌ను లాక్కెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు మంగళవారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన హీరన్ చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అయిన యూనస్ హుస్సేన్ రాయత్‌అలీ, హంస యూనస్‌లను అరెస్టు చేసి విచారించగా వారు పుంగనూరు, రాయచోటి పట్టణంలో చైన్ స్నాచింగ్ చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి సుమారు 45 గ్రాముల బంగారు చైన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్ బైక్ సీజ్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ కేసులో అరెస్టు అయిన యూనస్ హుస్సేన్ రాయత్ అలీ, హంస యూనస్‌లు తమిళనాడు రాష్ట్రం దండిగల్ జిల్లా గాంధీనగర్‌కు చెంది, ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పరిధిలోని కలికిరి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారని తెలిపారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

కొండాపురం, జూలై 23: మండలంలోని పెంజి అనంతపురం సబ్‌స్టేషన్ వద్ద మూడు రోజుల కిందట సెంట్రింగ్ రేకుల చోరీ కేసులో మంగళవారం పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. కొండాపురం పట్టణానికి చెందిన ముగ్గురిని గండ్లూరు, చౌటిపల్లె గ్రామాలకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. నేషనల్ హైవే పనులకు సంబంధించిన సుమారు రూ.1,20,000 విలువ చేసే సెంట్రింగ్ రేకులను వారి నుంచి రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాళ్లపాకలో వేడుకగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్త బృందాలు

రాజంపేటటౌన్, జూలై 23: అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో జరుగుతున్న సిద్దేశ్వరస్వామి, చెన్నకేశవస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఎంతో శోభాయమానంగా అలంకరించిన రథంపై ఊరేగుతూ తాళ్లపాక మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గోవిందనామస్మరణలు, భజన బృందాల కోలాటాల నడుమ ఆద్యంతం కన్నుల పండువగా సాగిన ఈ కార్యక్రమాలను భక్తులు ఆనందోత్సాహాలతో తిలకించారు. కాగా రథం చక్రం ఒకటి విరగడంతో కార్యక్రమానికి అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో తాళ్లపాక దేవాలయాల సమూహ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామియాదవ్, వినోద్‌కుమార్, సర్పంచ్ గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థానంల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ గోపీబాబు, ఆర్.స్వామినాయక్, దేవరాజులు, ధర్మచార్యులు గంగనపల్లి వెంకటరమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు బి.మఠం చెరువు మత్స్యసంపద వేలం

కడప(రూరల్) జూలై 23 : బి.మఠం చెరువులో 2024 జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు చేపలు పట్టుకుని, అమ్ముకునేందుకు ఈ నెల 25న గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు బి.మఠం మత్స్య క్షేత్రం అభివృద్ధి అధికారి ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10-30 గంటల నుంచి 1-00 గంట వరకు బహిరంగ వేలం ఉంటుందని.. ఆసక్తి కలిగి వేలంలో పాల్గొనదలచిన వారు రూ.500 పైకం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

వసతిగృహాలను తనిఖీ చేసిన వీసీ


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ రఘునాధరెడ్డి

కడప (ఎడ్యుకేషన్) జూలై 23: వైవీయూ బాలుర, బాలికల వసతి గృహాలను వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు ఎస్.రఘునాధరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ పద్మతో కలిసి తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో వసతిగృహం సందర్శించి.. విద్యార్థులు తింటున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. వసతి గృహాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేయాలని చెప్పారు. వంటశాల, డైనింగ్ హాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బోగస్ ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌తో భూమి రిజిస్ట్రేషన్

● చర్యలు తీసుకోవాలని బాధితురాలి విజప్తి


తప్పుడు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ చూపుతున్న సగిలి పార్వతి, ఆమె తండ్రి సింగరయ్య

చెన్నూరు, జూలై 23 : కడప తహసీల్దారు కార్యాలయంలో తప్పుడు ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ పొంది.. విలువైన ఎకరా 29 సెంట్లు భూమిని తన భార్య పేరున ఓ వ్యక్తి రిజిస్టరు చేయించుకున్నాడు. దీంతో బాధితురాలు, అతని పినతల్లి కలెక్టరుతో పాటు ఆర్డీవోకు వినతి పత్రాలు సమర్పించి రద్దు చేయాలని కోరారు. వివరాల్లోకి వెళితే.. చెన్నూరుకు చెందిన సగిలి పార్వతి కడప నగరం చిన్నచౌకు ఏరియాలోని కొండాయపల్లెలో చాలా ఏళ్లుగా నివశిస్తోంది. ఆమె భర్త సగిలి సుబ్బరాయుడు కడప సబ్‌ట్రెజరీ ఆఫీసులో పనిచేస్తూ 2021 మే 27న మృతి చెందాడు. దీంతో అతని తరువాత వారసురాలిగా ఆయనకు వచ్చే పింఛను ఆమెకు వచ్చేటట్లు రికార్డుల్లో పొందుపరచడంతో ఆమెకు పింఛను వస్తోంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. మృతి చెందిన సగిలి సుబ్బరాయుడుకు తన తల్లి నుంచి సంక్రమించిన చెన్నూరు రెవెన్యూ పొలంలో సర్వే నెం.153లో 1.29 ఎకరాలు వ్యవసాయం పొలం ఉంది. పుష్పగిరి వెళ్లే రోడ్డులో ఉన్న ఈ పొలం విలువ కాస్త ఎక్కువే. దీంతో ఆ పొలాన్ని ఎలాగైనా తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకున్నాడు మొదటి భార్య కుమారుడైన సగిలి విజయకుమార్ యాదవ్. అయితే సుబ్బరాయుడుకు చాలా ఏళ్ల క్రితం ప్రొద్దుటూరుకు చెందిన మహిళతో వివాహం కాగా.. ఆమె మగబిడ్డ ప్రసవించిన రోజునే చనిపోయింది. ఆ తరువాత చెన్నూరుకు చెందిన నక్కా శింగరయ్యకుమార్తె పార్వతిని వివాహం చేసుకున్నాడు. ఈమెకు ముగ్గురు ఆడపిల్లలు. తల్లి చనిపోయిన బాబును అప్పటి నుంచి పార్వతి పెంచి పెద్ద చేసి వివాహం చేసింది. కాగా సగిలి సుబ్బరాయుడు సబ్ ట్రెజరీ ఆఫీసులో ఉద్యోగం చేసే సమయంలో చిన్నచౌకు ఏరియాలోని కొండాయపల్లెలో ఇల్లు కూడా కట్టుకున్నారు. ఆ ఇంటిని ముందుభాగం తన పెద్ద భార్య కుమారునికి రెండోభాగం ప్రస్తుతం ఉన్న పార్వతికి ఇచ్చారు. కాగా విజయకుమార్ మొత్తం ఇంటిని, భూమిని ఆక్రమించేం దుకు తరచూ పినతల్లితో గొడవలు పడేవాడు. ఈ విషయంలో పలువురు పెద్ద మనుషులు పలుమార్లు పంచాయతీ చేసినా ఫలితం లేకపోయింది. కాగా పార్వతి తన భర్త మొదటి భార్య సంతానమైన విజయకుమార్‌కు ఉన్న ఆస్తిలో సగం ఇవ్వాలని... భర్త చనిపోయిన అనంతరం ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ కోసం కడప రెవెన్యూ కార్యాలయం చుట్టూ రెండేళ్లు తిరిగినా సర్టిఫికెట్ మంజూరు చేయలేదు. అయితే విజయకుమార్ రెవెన్యూ కార్యాయలంలో ఏం చెప్పాడో, ఎంత ముడుపులు ఇచ్చాడో తెలియదు కానీ సర్టిఫికెట్ మాత్రం 19.7.2021న మంజూరు అయింది. అనంతరం ఆ సర్టిఫికెట్‌తో చెన్నూరులోని ఎకరా 29 సెంట్ల పొలాన్ని కాజేసే ఆలోచనతో 2023లో కడప రిజిస్టరు ఆఫీసులో రూ.8.26 లక్షలకు అతని భార్య కాటుక సింధూరి పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ అయింది. ఆన్‌లైన్ చేయించేం దుకు చెన్నూరు రెవెన్యూ కార్యాలయానికి రాగా.. అసలు విషయం బయటపడింది. ఇది తప్పుడు సర్టిఫికెట్ అని తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సగిలి పార్వతికి ఆమె తండ్రి నక్కా సింగరయ్యకు విషయం తెలిపి.. ఆన్‌లైన్ కాకుండా నిలిపివేశారు. ఆ సర్టిఫికెట్ తప్పుడుది అని తెలియడంతో ఇటీవల మూడుమార్లు కలెక్టరు, రెండుమార్లు కడప ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. తప్పుడు సర్టిఫికెట్‌తో ఆస్తిని కాజేయాలని చూసిన సగిలి విజయకుమార్‌యాదవ్‌పై, సర్టిఫికెట్ మంజూరు చేసిన కడప రెవెన్యూ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయదుర్గ ఆలయంలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి.. పూజలు చేస్తున్న భక్తులు

కడప (కల్చరల్), జూలై 23 : విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలను గత 18 ఏళ్లుగా క్రమం తప్పకుండా చేస్తున్నామని ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం అమ్మను చక్కగా అలంకరించి భక్తులకు దర్శనం అందించారు. ఆలయ అర్చక స్వాములు మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు అమ్మవారి సన్నిధిలో రాహుకాల పూజలు చేశారు.అర్చకులు భక్తుల చేత చేయించి రాహుకాల దీపాలు వెలిగింపజేశారు. అలాగే ఆలయంలో ప్రతి శుక్రవారం, మంగళవారం, పౌర్ణమి రోజుల్లో అమ్మవారికి విశేష అభిషేకం, ప్రతి నెలా రెండో ఆదివారం విజయదుర్గా మల్లిఖార్జున స్వామివారి కళ్యాణం, ప్రతి పౌర్ణమి రోజున చండీహోమం, దీపాలంకార సేవ ఉంటాయని దుర్గాప్రసాద్ వివరించారు.

కడపలో గంజాయిపై మెరుపుదాడులు నిర్వహించాలి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 23 : కడపలో విపరీతంగా ఉన్న గంజాయిపై మెరుపుదాడులు నిర్వహించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లుగా కడప నగరంలో వైసీపీ ముఖ్యనాయకుల అండదండలతో గంజాయి విపరీంగా పెరిగిందన్నారు. కడప నగరంలో విచ్చలవిడిగా గంజాయి బారిన పడి వందలాది కుటుంబాల జీవితాలు నాశనం అయ్యాయన్నారు. కడప కేంద్రంగా నగరంలో యువత సర్వనాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని, వారి తల్లిదండ్రులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రధానంగా పాతబస్తీ, టూటౌన్ పరిధిలో గంజాయి ఏరులై పారుతుందన్నారు. తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలి

వేంపల్లె, జూలై 23: దివ్యాంగ పిల్లలను విద్యాబుద్ధులు నేర్పించి వారికి మానసికంగాను, శారీరకంగా మెరుగుపరిచి సాధారణ పిల్లలుగా మారేందుకు కృషిచేయాలని సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ ట్రైనింగ్ రాష్ట్ర అధికారి కల్పన సూచించారు. మంగళవారం ఆమె వేంపల్లె భవిత కేంద్రంను తనిఖీ చేసి దివ్యాంగ పిల్లలతో మాట్లాడారు. ఐఈఆర్టీ యశోద, ఎంఈఓలు సాదిక్ జాఫర్, స్టాలిన్‌లతో చర్చించారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి అవకాశాన్ని పిల్లలకు ఉపయోగించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్లు కేశవరెడ్డి, రమణమూర్తి పాల్గొన్నారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం అందిస్తాం

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) జూలై 23:పాన్ ఇండియా ప్రచారం 2024లో భాగంగా జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించి వారికి తగిన న్యాయ సహాయం అందిస్తామని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవావరం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహంను జడ్జి విజిట్ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రచారం 2024 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాల పంపిణీతో పాటు బ్యానర్లను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఉచిత న్యాయసహాయం, రక్షణ సలహా వ్యవస్థను తెలియజేశారు. పారాలీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధివిధానాలు తెలియజేశారు. పిల్లల తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ జువినల్ జస్టిస్ బోర్డు, ఫస్ట్ అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ నందిని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్, ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ వీరయ్య, డిస్టిక్ ప్రొహిబిషన్ అఫీసర్ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

పనితీరు మెరుగుపరచుకోండి

సీకేదిన్నె, జూలై 23: భవిత పాఠశాల రీసోర్స్ పర్సన్స్ తమ పని తీరును మెరుగుపరచుకుని విద్యార్థులకు మంచి విద్య అం దించాలని రాష్ట్ర పరిశీలకురాలు కల్పనశైల తెలిపారు. మంగళవారం చింతకొమ్మదిన్నె మండలంలోని దివ్యాంగుల పాఠశాల ఆజాద్‌నగర్, వెంకటగారిపల్లె పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వారికి మెరుగైన విద్యను అం దించాలన్నారు. అందుకు అవసరమైన పనితీరును మెరుగుపరచుకుని నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత రీసోర్స్‌పర్సన్‌పై ఉందన్నారు. కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భూ మాఫియాపై విచారణ జరిపించాలి'

కడప (మారుతీనగర్), జూలై 23: వైసీపీ పాలనలో జరిగిన భూ మాఫియాపై విచారణ జరిపించాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనర్ ఆంజనేయులు కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అండదండలతో భూ మాఫియా జిల్లాలో పేట్రేగిపోయిందన్నారు.

పోష్ చట్టంపై అవగాహన అవసరం

పులివెందుల రూరల్, జూలై 23: పోష్-2013 చట్టంపై అవగాహన అవసరమని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు.

ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్) జూలై 23: ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మ హేశ్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ మేనేజ్ మెంట్లలో పని చేస్తున్న ఉపాధ్యాయ సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు.

ప్రత్యేక ఉర్దూ డీఎస్సీ నిర్వహించాలి

కడప (ఎడ్యుకేషన్) జూలై 23 : రాష్ట్రంలో ప్రత్యేక ఉర్దూ డీఎస్సీ నిర్వహించాలని హిఙ్మత్ ఏ కల్క్ వ్యవస్థాపకుడు గయాజ్ అహ్మద్ కోరారు. మంగళవారం రాష్ట్ర మైనార్టీ శాఖా మంత్రికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాషా అభివృద్ధికి తోడ్పాటుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఉర్దూ పాఠ్యపుస్తకాలు, ఉర్దూ ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. దీనిపై చొరవ చూపాలన్నారు.

మా పార్టీ అధినేత సమర్ధతతోనే కేంద్రం నిధులు

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు, ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తుంటారని, మా పార్టీ అధినేత సమర్థతతోనే కేంద్రం ఈ నిధులు ఇచ్చిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు హర్షించదగ్గ విషయమన్నారు. అన్నిప్రాంతాల, అన్నిరంగాల అభివృద్ధికి, కేంద్రం నుంచి భారీగా నిధులు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు చేసి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి లాభం చేకూర్చారన్నారు. గత జగన్ ప్రభుత్వంలో జగన్ తన స్వంత లాభాల కోసం, తన కేసుల మాఫీ కోసం కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూ.15వేలు కోట్ల ఆర్థిక సాయం చేయడం చారిత్రాత్మకమన్నారు. వెనుకబడ్డ రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించడంతో అన్ని జిల్లాలు చంద్రబాబునాయుడు నేతృత్వంలో అభివృద్ధి దిశగా ముందుకు వెళతాయన్నారు. నీరు, విద్యుత్ , రైల్వే, రోడ్ల ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయంచారన్నారు. రాష్ట్రఅభివృద్ధికి చంద్రబాబు మరోసారి తన మార్కు రాజకీయం చూపించారన్నారు.

ఏపీకి ఆక్సిజన్‌లా కేంద్ర బడ్జెట్: సింగారెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 23: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేం ద్ర బడ్జెట్ ఏపీకి ఆక్సిజన్‌లా ఉందని బీజేపీ కేంద్ర ప్ర భుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అమరావతి రాజధాని ని ర్మాణం కోసం రూ.15వేల కోట్ల కేటాయింపు హర్షణీయమన్నారు. మంగళవారం కడపలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల స మావేశంలో మాట్లాడారు. ఏపీకి జీవనాడిగా కొనియాడబడుతున్న పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సుమారు రూ.12వేల కోట్ల కేటాయింపుతో ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తున్నదన్నారు.

బడ్జెట్ లోపభూయిష్టంగా ఉంది

● యువజన సమాఖ్య మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 23 : బడ్జెట్ లోపబూయిష్టంగా ఉందని యువజన సమాఖ్య మా జీ జిల్లా అధ్యక్షుడు చం ద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలో స్థానిక భారత ప్ర జాతంత్ర యువజన స మాఖ్య (డీవైఎఫ్ఐ) జి ల్లా కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్- నిరుద్యోగంపై సెమినార్ నిర్వహించారు. యువజన సమాఖ్య మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్లమెంటు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే లోపబూయిష్టంగా ఉందన్నారు. కార్పొరేట్ దోపిడీకి కేంద్రం ఊతమిస్తున్నట్లు స్పష్టంగా కనబుడుతోందన్నారు. మోదీ కేబినెట్ నిర్ణయాలు దేశంలో ఆర్థిక అంతరాలు పూడ్చలేని అఘాతంగా మారుస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి, సీఐటీయూ కడప నగర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నగర నాయకులు విజయ్, అనిల్, భాస్కర్‌రెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమపై నీళ్లు: ఆర్పీపీ

రాష్ట్ర విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ పూర్తి చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఏటేటా బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమపై నీళ్లు చల్లుతోందని ఆర్పీపీ నేత రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

ఏపీకి ఇచ్చింది గ్రాంటా.. అప్పా?

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 23 : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చింది గ్రాంటా లేక అప్పా అనేది తేల్చాలని ఐఎస్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయమందిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ చెప్పకపోవడం శోచనీయమన్నారు. మల్టీ లేటరల్ డెవలప్‌మెంటు ఏజెన్సీల ద్వారా రూ.15వేల కోట్ల ఆర్థిక మద్దతు అందిస్తామని కేంద్రమంత్రి చెప్పడం గమనార్హమన్నారు. అలాగే రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు గ్రాంటా, అప్పా అనేది తేల్చాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంపై అప్పులభారం పెట్టొద్దని కోరారు.

ఉద్యోగులకు ఊరట ఇవ్వని కేంద్ర బడ్జెట్: ఏపీటీఎఫ్

ఉద్యోగులు ఆశించిన విధంగా పన్ను నిబంధనలు కేంద్ర బడ్జెట్‌లో మార్చకపోవడం శోచనీయమని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవన వ్యయాన్ని ధరల సూచిక ద్రవ్యోల్బణం అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆదాయ పన్ను శ్లాబులు మార్చలేదన్నారు. ఓల్డ్ రెజ్యూమ్, న్యూరెజ్యూమ్ లేకుండా ఒకే విధానం ప్రవేశపెట్టడం ఉద్యోగులకు ఇబ్బందికరమన్నారు.

ఉద్యోగులను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్: ఎస్టీఎఫ్

పాత పింఛను విధానంపై ఎటువంటి స్పష్టమైన ప్రకటన చేయకుండా సీపీఎస్ విధానంలో మాత్రమే మార్పులు తెచ్చారని కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం ఉద్యోగ ఉపాధ్యాయులను నిరాశపరిచిందని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల ఇన్‌కమ్‌ట్యాక్స్‌కు సంబంధించి పాత విధానంలో పన్నులు చెల్లించే వారికి రాయితీ కల్పిస్తారని ఆశిస్తే మరోసారి కొత్త పన్నువిధానానికి రాయితీకి ప్రకటించడం ఉద్యోగులను నిరాశకు గురిచేసిందన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కడప (మారుతీనగర్), జూలై 23: విద్యారంగ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత వైసీపీ పాలనలో విద్యారంగం పూర్తిగా కుదేలైందన్నారు.యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ నిరుద్యోగులకు పలు హామీలిచ్చారన్నారు. ఆ హామీలను అమ లు చేయాలన్నారు. సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర సం యుక్త కార్యదర్శి మల్లికార్జున, జిల్లా కన్వీనర్ మాణిక్యరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైవీయూలో జాబ్‌మేళా

కడప (ఎడ్యుకేషన్) జూలై 23 :వైవీయూలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు ప్రొఫెసర్ ఎల్లొరెడ్డి తెలిపారు. టీసీఎల్, అపోలో ఫార్మసీ కంపెనీలు దాదాపు 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి ముందుకు వచ్చాయన్నారు. టీసీఎల్ కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే ఫార్మ కంపెనీలో ఉద్యోగాలకు బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ ఉండాలన్నారు. 24న ఉదయం 10గంటలకు ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయంలో హాజరు కావా

మైనార్టీ హాస్టల్‌ను అన్ని వసతులు ఉన్న భవనంలోకి మార్చాలి

● టీఎన్ఎస్ఎఫ్, పీఎస్‌యూ డిమాండ్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 23 : మైనార్టీ హాస్టలును అన్ని వసతులు ఉన్న భవనంలోకి మార్చాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మైనార్టీ హాస్టల్‌ను వారు పరిశీలించారు. విద్యార్థులతో మా ట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా మైనార్టీ కళాశాల బాలుర వసతిగృహాన్ని కనీస వసతులు లేని అద్దె బవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. దాదాపు వందల మంది కెపాసిటీ ఉండాల్సిన హాస్టల్‌లో వసతులు లేనందు వల్ల కేవలం 9 మంది మాత్రమే ఉండటం బాధాకరమన్నారు.

ప్రజాహక్కుల కోసం పోరాటం : సీపీఐ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 23 : దేశంలో రైతులు కార్మికులు, నిరుద్యోగుల పేద ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాటం సాగిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలను రాజకీయ చైతన్యవంతులను చేసి రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం సాగిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఓబులేసు మాట్లాడుతూ కేవలం అమరావతి, పోలవరమే కాకుండా అత్యంత కరువుపీడిత ప్రాంతమైన రాయలసీమలో నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టి సారించి వాటికి నిధులు కేటాయించి పూర్తి చేసి తాగు, సాగునీరు అందివ్వాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, కార్యవర్గసభ్యులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, వెంకటశివ, చంద్రశేఖర్, వీరశేఖర్, బాదుల్లా, మద్దిలేటి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలలకు ఉచితంగా మినరల్ వాటర్

వేంపల్లె, జూలై 23: వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ ప్రాథమికపాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీకి శ్రీకారంచుట్టారు. రాజీవ్‌కాలనీకిచెందిన టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సుజల నీటిని మంగళవారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రజనీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతిరోజు విద్యార్థులకు మినరల్ వాటర్‌ను అందించడం శుభపరిణామమన్నారు. టీడీపీనాయకులుపాల్గొన్నారు.

ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు శుభపరిణామం

వేంపల్లె, జూలై 23: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను టీడీపీ ప్రభుత్వం రద్దుచేసి రైతులకు మేలు చేసిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతికి రూ.15000 కోట్లు, పోలవరం నిర్మాణం పూర్తికి సహకరిస్తామని, రాష్ట్రంలో మరిన్ని నిధులు బడ్జెట్‌లో కేటాయించడంశుభపరిణామమన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చేందుకు వైఎస్ జగన్ కంకణం కట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి నిధులు ఇచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

'అధికారం పోయాక నీతులు మాట్లాడడమా'



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కమలాపురం రూరల్, జూలై 23 : అధికారం పోయాక నీతులు మాట్లాడడం సరికాదని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ అధికారంలోంచి దిగిపోగానే ప్రజలపై ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. మీరు ఎంత మొత్తుకున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో కాపునాయుడు దాది రామయ్య, గండి నారాయణ, పుత్తా ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, చెన్నారెడ్డి, జగన్‌మోహన రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి'

కడప (క్రైం), జూలై 23: జిల్లాలోని బి.కోడూరు మండలం కొండపల్లె పెదుళ్లపల్లె గ్రామ పొలంలో కె.నరసింహారావు అతని భార్యకు సంబంధించిన పొలం రికార్డులు తారుమారు చేసి గంగిరెడ్డి రామమోహన్‌రెడ్డి, అతని చిన్నమ్మ గంగిరెడ్డి లక్ష్మీదేవి పేరు మీద తయారు చేయించుకున్నారని న్యాయం చేయాలని బాధితులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదేం అన్యాయమని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఇంజక్షన్ ఆర్డర్, ఈ -పాస్‌బుక్‌లలో తమ పేర్లు ఉన్నా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

వేంపల్లె, జూలై 23: వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగుట్రాక్టర్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. సీఐ చాంద్‌బాష ఆధ్వర్యంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెబ్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. వేంపల్లె పాపాఘ్ని నుంచి ప్రతిరోజు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. తనిఖీలు తూతూమంత్రంగానే చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఆధార్ సెంటర్‌ను వినియోగించుకోండి

కడప (నాగరాజుపేట), జూలై 23 : ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కామన్ సర్వీస్ సెంటరు జిల్లా మేనేజరు సుబ్రమణ్యం, వీఎల్ షేక్ ఖాజామైనుద్దీన్ పేర్కొన్నారు.0-5 సంవత్సరాల పిల్లలకు మహిళా శిశు సమగ్ర అభివృద్ధి సంస్థ ద్వారా ఆధార్ అప్‌డేట్ అనుసంధాన ప్రక్రియను మంగళవారం అక్కాయపల్లె సెక్టారులో గల పీఓ శోభారాణి, సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అంగన్వాడీ టీచర్ ఉమ, హెల్పర్లు పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

మామా అల్లుళ్లు భ్రమలో ఉన్నారు

● టీడీపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

కమలాపురం రూరల్, జూలై 23 : మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అధికారం పోయినా ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో ఉన్నారని కమలాపురం నియోజకవర్గ టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హత్యారాజకీయాలు ప్రోత్సహించింది వైసీపీనే అన్నారు. వినుకొండలో వ్యక్తిగత కారణాలతో హత్య జరిగితే దానికి రాజకీయ రంగు పులిమి ప్రయోజనం పొందాలని వైసీపీ చూస్తోందన్నారు. సొంత చిన్నాన్నను అత్యంత కిరాతకంగా గొడ్డలితో నరికి చంపినప్పటికీ ఆ విషయాలు బయటికి పొక్కనీయకుండా చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌దేన్నారు. ఇప్పటికైనా తమ ఓటమికి గల కారణాలను తెలుసుకుని, అసత్య ప్రచారాలు మానుకుని ప్రజల పక్షాన నిలబడితే బాగుంటుందని హితవు పలికారు. టీడీపీ మండల కన్వీనర్ రాఘవరెడ్డి, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వ కార్యాలయాల్లో భద్రతపై పోలీసుల తనిఖీ

పులివెందుల టౌన్, జూలై 23: మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన సంఘటనతో పోలీస్ అధికారులు అప్రమత్త మయ్యారు. మంగళవారం పులివెందులలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డ్ గదులను ఇన్‌చార్జి సీఐ మోహన్ పరిశీలించారు. ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్, ట్రెజరీ, ము న్సిపల్ తదితర కార్యాలయాల్లో భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి సూచనలు ఇచ్చారు. సమస్యలు తెలియజేయాలన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ రూమును పరిశీలిస్తున్న సీఐ

మంత్రులను కలిసి సమస్యలు విన్నవించిన బీటెక్ రవి

పులివెందుల టౌన్, జూలై 23: పులివెందుల నియోజకవర్గంలోని పలు సమస్యలను టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కలిశారు. ప్రధాన రోడ్లు, గ్రామాల అంతర్గత రోడ్లు, మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని కోరారు. అలాగే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నర్సుల కొరత, కార్పొరేట్ ఆసుపత్రికి అనుగుణంగా పులివెందుల ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని కోరారు. ఆయా సమస్యలకు సంబంధించిన ప్రతిపాదనలు మంత్రులకు అందించారు. సమస్యలు పరిష్కరించేందుకు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు బీటెక్ రవి తెలిపారు.



మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న బీటెక్ రవి

మహిళలను వేధిస్తే కఠిన శిక్షలు : సీడీపీఓ

వేంపల్లె, జూలై 23: మహిళలను వేధిస్తే కఠినంగా శిక్షలు ఉంటాయని, ఈ విషయాలపై మహిళలు అవగాహన పెం పొందించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత తెలిపారు. వేంపల్లె మం డల పరిషత్ సభాభవనంలో పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైం గిక వేధింపుల నిరోధక చట్టంపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఎక్కడైన ఇబ్బందిపడే మహిళలు చట్టాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మమిళలకు చట్టంపై అవాహన కలిగేలా ఉగ్యోగులు చొరవ చూపాలని ఆమె కోరారు. ఎంపీడీఓ దివిజ, ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకర జన్మదిన వేడుకలు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 23 : కడప జిల్లా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ పుట్టిన రోజును మంగళవారం జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా సుంకర శ్రీనివాస్ బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖ ర్ ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసైనికులు, అభిమానుల, కార్యకర్తల మధ్య సుంకర శ్రీనివాస్ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి (ప్రోగ్రామ్ కమిటీ) సురేశ్‌బాబు, బోరెడ్డి నాగేంద్ర, నగర అధ్యక్షుడు ఫ్రాన్సిస్, వ్యక్తిగత కార్యదర్శి శేషురాయల్, భరత్‌కుమార్, తరుణ్, వినయ్, ఆకుల గోపి, సుబ్బరాయుడు, స్వరూప్ తదితర నాయకులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సుంకర శ్రీనివాస్

'వ్యాయామ ఉపాధ్యాయులకు అనుమతివ్వాలి'

కడప (స్పోర్ట్స్), జూలై 23:జిల్లాలోని కొంతమంది అర్హత కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న నేపథ్యంలో వారు లాస్‌ఆఫ్‌పే ఇన్ సర్వీస్ బీపీఈడీ చేసుకునే వెసులుబాటు కల్పించాలని జిల్లా స్కూల్ అసిస్టెంట్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి అనురాధకు వినతిపత్రం అందజేశారు. రెండు సంవత్సరాల ఇన్ సర్వీస్ బీపీఎడ్ కోర్సును పూర్తిచేసి తద్వారా పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొందగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంకాలమ్మకు పూజలు


ప్రత్యేక అలంకారంలో అంకాలమ్మ

పోరుమామిళ్ల, జూలై 23 : స్థానిక బెస్తవీధిలో నిర్మించిన అంకాలమ్మ దేవాలయంలో ఆషాఢ మంగళవారం సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి ఒడిబియ్యం సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి అందరూ చల్లగా ఉండేలా దీవించాలని పూజలు చేశారు.

పర్యావరణాన్ని పాడుచేయద్దు

ప్రొద్దుటూరు క్రైం, జూలై 23 : పట్టణంలోని ఖాళీ ప్రదేశాల్లో మద్యం సీసాలు పడవేసి పర్యావరణాన్ని పాడుచేయవద్దని ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ సూచించారు. మంగళవారం స్థానిక రామేశ్వరం రోడ్డులోని పలు ఖాళీ ప్రదేశాల్లో పడేసిన మద్యం సీసాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మందుబాబుల్లో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా సుబ్రమణ్యస్వామి మండల పూజ


పుష్పాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23: వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం సుబ్రమణ్యస్వామికి మండల పూ చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, గణపతి, నవగ్రహ, సుబ్రమణ్యస్వామి హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను రంగు రంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి కాయాకర్పూరం సమర్పించారు.

వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం


వ్యర్థాలతో నిండిన కుప్పతొట్టి

జమ్మలమడుగు, జూలై 23: జమ్మలమడుగు ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ప్రధాన రోడ్డుపై వ్యర్థాలు నిలువచేసే చెత్తడ్రమ్ము రోడ్డుకు అడ్డంగా ఉంది. ఆహారం కోసం ఆవులు అక్కడికి చేరుకుంటుండడంతో అందులోని చెత్తంతా రోడ్డుమీద చెల్లాచెదురుగా పడిపోతోంది. ప్రధాన రోడ్డు కావడంతో ఈ పరిస్థితి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యమే ఈ సమస్యకు కారణమని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రధాన రోడ్డుపై అడ్డంగా ఉన్న చెత్త డబ్బాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అనారోగ్యంతో నర్స్ జయమ్మ మృతి



మైదుకూరు రూరల్ జూలై 23 :మైదుకూరులోని పాతూరులో నివసిస్తున్న నర్స్ జయమ్మ(88) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. పాతూరులోని ప్రజలు .ఆమె సలహా మేరకు మాత్రమే వైద్యులను సంప్రదించేవారు. ఒక్క రూపాయి కూడా డబ్బు తీసుకోకుండా ఉచితంగా వైద్య సేవలు చేసేవారు. రిటైర్డ్ అయిన కూడా ఆమె ఇంటి వద్ద వైద్య సేవల నిమిత్తం ప్రజలు క్యూ కట్టేవారు. మహిళలకు ఆపరేషన్ అవసరం రాకుండానే కాన్పులు చేసేవారు.జయమ్మ పాతూరులోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా మంచి పేరు సంపాదించారు. ఆమె మరణం పాతూరుకు తీరని లోటు అని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

పేద, మధ్యతరగతి భరోసా బడ్జెట్


మాట్లాడుతున్న మాదాసు మురళి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23: పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా కల్పించేలా కేంద్ర బడ్జెట్ ఉందని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి వ్యాఖ్యానించారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల రూపాయల ఆర్థికసాయం ప్రకటించడం, పోలవరానికి నిధులు ఇస్తామనడం శుభపరిణామం అన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్తు, రోడ్లకు నిధులు కేటాయిస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణయ్యయాదవ్, భాస్కర్‌రెడ్డి, ప్రతాప్, లక్ష్మీనారాయణ, కమాల్‌బాష పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం

పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీపై బడ్జెట్‌లో ప్రస్తావించనేలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

వేతన జీవులకు నిరాశ

బద్వేలు: కొత్త బడ్జెట్‌తో వేతన జీవులకు ఎలాంటి ఊరటకలగలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌లో మార్పులు తెస్తామని చెబుతూనే, పాత పెన్షన్ విధానంపై బడ్జెట్‌లో ప్రస్తావించక పోవడం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందన్నారు. అలాగే ఉద్యోగుల ఇన్‌కం టాక్స్‌కు సంబంధించి పాత విధానంకంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువగా చెల్లించాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికే మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ సారైనా పాత విధానంలో పన్నులు చెల్లించేవారికి రాయితీ ఇస్తారనుకుంటే నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు. పాత పన్నుల విధానంలో 7 లక్షల వరకు మినహాయింపు ఇచ్చేవిధంగా శ్లాబ్ విధానం సవరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బద్వేలు మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ గుర్రయ్య, గోపవరంమండల అధ్యక్షులు క్రిష్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.డి. గౌస్ తదితరులు పాల్గొన్నారు.

'పోష్' చట్టం పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీ లక్ష్మి

బద్వేలు, జూలై 23: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్- 2013)ను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి డి.శ్రీ లక్ష్మి కోరారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పోష్ చట్టంపై మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు మాసాలకు ఒకసారి కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, ఫిర్యాదులు ఉంటే పరిష్కరించాలన్నారు. ప్రతి సంవత్సరం కమిటీ వార్షిక నివేదికలను లోకల్ కంప్లైంట్స్ కమిటీకి నివేదించాలని ఆమె తెలిపారు. ఈ కమిటీకి మూడేళ్ల వరకు కాల పరిమితి ఉంటుందన్నారు. చిన్న పిల్లల రక్షణకు 1098, మహిళా సమస్యలకు 181, 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వేధింపులకు గురైన మహిళలు మున్సిపాలిటీ స్థాయిలో మున్సిపల్ కమిషనర్‌కు , మండల స్థాయిలో తహసీల్దారుకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. ఒక వేళ నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయలేని వారికోసం ప్రతి కార్యాలయంలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ చట్టాన్ని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో నిష్పక్షపాతంగా అమలుచేయాలని, గ్రామస్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పి. వెంకటేశ్వర్లు సీడీపీవోలు శ్రీదేవి, లక్ష్మిదేవి, డీఎల్‌డీఓలు రజనీకాత్‌లు , తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, పంచాయతీరాజ్‌శాఖ, పోలీసు శాఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు

నర్సాపురంలో నేడు సమావేశం

కాశినాయన: నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10.30కు. పోష్ యాక్టు 2013పై తహసీల్దారు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు చంద్రకళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని అన్నిశాఖల మండలస్థాయి అధికారులు పంచాయతీ సెక్రెటరీలు, వీఆర్వోలు ఇతర సిబ్బంది తప్పక హాజరుకావాలని కోరారు.

రోజులు మారాయి.. ఫీల్డ్ అసిస్టెంట్లు మారాలి

- సామాజిక తనిఖీల్లో రూ.1,19,187 రికవరీ
- అడిషనల్ ఏపీడీ నాగరత్నమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఏపీడీ నాగరత్నమ్మ

ఖాజీపేట, జూలై 23: రోజులు మారాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా మారాలని అడిషనల్ పీడీ నాగరత్నమ్మ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో 18వ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని అలాగని ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కొంతమంది నిర్లక్ష్యంగా ఉన్నారని, జాగ్రత్తగా లేకుంటే ఇంటికి వెళ్లక తప్పదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నిబంధనలకు లోబడి పనిచేయాలని, అహంబావంతో పని చేయరాదన్నారు. సామాజిక తనిఖీ అంటే చూద్దాం, ఇస్తాం, కట్టిస్తామని కుంటిసాకులు చెప్పడంకాదని, ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత వారందరిపై ఉందన్నారు. కొన్ని పంచాయతీల్లో అవకతవకలు జరిగాయని, వారి నుంచి రూ.1,19,187 రికవరి చేశామన్నారు. ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఖాజీపేట మేజర్ పంచాయతీలోని చెర్లోపల్లెలో ఈ ఏడాది ఒక్కరోజు కూడా పని కల్పించలేదని, ఫీల్డ్ అసిస్టెంటు, అవకతవకలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే వారు మరిన్ని అవకతవకలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జుబేదా, ఎమ్మీవో రమణ, జెక్యూసీ మధుసూదన్, ఈవోపీఆర్‌డీ, ఎస్‌ఆర్‌పీ కన్నారెడ్డి, ఏపీవో చంద్రశేఖర్, డిజిటల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగుపై తగ్గిన ఆసక్తి

- స్వల్పకాలిక పంటల సాగుపైనే మొగ్గు..


పత్తి విత్తుతున్న కూలీలు, (ఇన్‌సర్ట్) ట్రాక్టర్ సాయంతో పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

రాజుపాలెం, జూలై 23 : పత్తి సాగులో ఏటేటా నష్టాలే ఎదురవుతుండడంతో మండలంలో ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం భారీగా పడిపోయింది. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కొందరు రైతులు ఇప్పుడిప్పుడే సాగుకు సిద్ధమవుతున్నారు. అయితే, పత్తిలో సరైన దిగుబడి రాకపోవడంతో పాటు ఖర్చులు పెరుగుతుండడంతో పాటు ఆ పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. మండలంలో గతంలో పదివేల కు పైగా ఎకరాల్లో పత్తి సాగవుతుండగా, ప్రస్తుత పరిస్థితుల్లో సాగు విస్తీర్ణం 2 , 3వేల ఎకరాలకు పడిపోయే అవకాశం కనిపిస్తోంది.. ఈ నేపథ్యంలో స్వల్పకాలిక రకాలైన మినుము, శెనగ పైర్ల సాగుకే ఎక్కువ మక్కువ చూపుతున్నారు.

విత్తన దుకాణాలు వెలవెల

గతంలో పత్తి విత్తనాల కోసం రైతన్నలు ఎగబడేవారని దుకాణదారులు చెబుతున్నారు. దీంతో కొన్ని బ్రాండ్లను అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకునే వారని, ప్రస్తుతం పత్తి సాగు తగ్గిపోవడంతో ప్రభుత్వం కేటాయించిన రేట్లకే ఇస్తామన్నా కూడా ఎవరూ ముందుకు రావడం లేదని అంటున్నారు.

డీవైఎఫ్‌ఐ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23: ఈనెల 27 నుంచి నంద్యాలలో నిర్వహిస్తున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలోని నేషనల్ పీజీ కళాశాలలో శిక్షణ తరగతులు జరుగుతాయని, 30వ తేదీ రాష్ట్ర ప్లీనం నిర్వహిస్తామన్నారు. "ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీల అమలు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, నూతన పరిశ్రమల ఏర్పాటు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విద్యార్థులు, యువత శిక్షణ తరగతులలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు

రెవెన్యూ మంత్రిని కలిసిన రితేష్‌కుమార్‌రెడ్డి


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, జులై 23 : కబ్జాలను అరికట్టి ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని బద్వేలు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించారు. మంగళవారం విజయవాడలో రెవెన్యూ శాఖమంత్రి కార్యాలయంలో ఆయన మంత్రిని కలిశారు. బద్వేలులో గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూకబ్జాలు జరిగాయని, వాటిపై విచారణచేసి ప్రభుత్వభూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


మురుగుకాలువలు శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటర్

బద్వేలుటౌన్, జూలై 23 : సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాలను నిల్వ ఉంచరాదని, నకిలీ పదార్థాలను, టేస్టింగ్ సాల్ట్‌ను వాడరాదని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లవారికి సూచించారు. ప్రజలు తడిచెత్త, పొడి చెత్త వేరు వేరు డబ్బాలలో వేసుకొని మున్సిపాలిటీ వాహనంలో వేయాలని కోరారు. పలు వార్డుల్లో మురుగుకాలువలను శుభ్రం చేస్తున్నామని, దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్నామని, మున్సిపాలిటీ పరిధిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మురుగుకాలువల్లో పూడిక తీత

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వెనుకవైపు ఉన్న మహబూబ్‌నగర్‌వార్డులో మురుగుకాలువలు పొంగి పొర్లుతుండడంతో దుర్గంధం వెలువడడంతోపాటు, దోమలు వ్యాప్తిచెందుతున్నాయని, తమ వార్డులోని సమస్యలను పరిష్కరించాలంటూ స్థానికులు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. దీంతో వారు మున్సిపల్ అధికారులతో మాట్లాడి, మురుగుకాలువలను జేసీబీ సాయంతో శుభ్రంచేసి, రోడ్లపై మురుగు వ్యర్థాలను తొలగించారు.

డెంగ్యూ జ్వరాలపై ఇంటింటి సర్వే

పట్టణంలోని ప్రజలు డెంగ్యూ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి ప్రజలకు డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించారు. దాదాపు 100 గృహాల వరకు ఫోకల్ స్ప్రేయింగ్ చేయించడం జరిగింది. అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యకమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ , హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలకు గుదిబండగా జీవో 117


సమావేశమైన ఏపీటీఎఫ్ 257 సంఘ నాయకులు

కలసపాడు, జూలై 23 : జీవో 117 ప్రాథమిక పాఠశాలలకు గుదిబండగా మారిందని ఏపీటీఎఫ్-257 జిల్లా ఉపాధ్యక్షుడు ఈ.బాలజోజి అన్నారు. కలస పాడు ఎమ్మార్సీలో మంగళవారం ఆ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 117 కారణంగా 1,2 తరగతుల్లో ఉండే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గి పాఠశాలలు కూడా మూతబడే స్థితికి కున్నాయన్నారు. ఈ జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేసి ఆ పాఠశాలలను కాపాడాలని మండల అధ్యక్షుడు కెకృష్ణారెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాలల కరెంటు బిల్లుల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని సంఘ నాయకులు బాల ఓబయ్య, కిరణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, వీరారెడ్డి కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి


మద్యం షాపుల వద్ద శుభ్రం చేయిస్తున్న ఎస్‌ఐ తిమోతి

పోరుమామిళ్ల, జూలై 23 : తహసీల్దారు, ఎంపీడీవో కా ర్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ తిమోతి అధికారులకు తెలిపారు. మంగళవారం ఎస్పీ ఆదేశాల మేరకు మండలం లోని కొట్టాలపల్లె, గానుగ పెంట, ఎస్.వెంకట్రామాపురం గ్రామాలను సందర్శించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు కార్యాల యం, ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలుతప్పవు

బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమోతి హెచ్చరించారు. మంగలవారం ఆయన పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతం సందర్శించి పంచాయతీ కార్మికులతో ఆ ప్రాంతం శుభ్రం చేయించారు. బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యానేరమన్నారు.

కొండాపురం: స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లప్రొద్దుటూరులో నేరాలకు అవకాశమున్న ప్రదేశాల్లో మద్యం సీసాలు , వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పరిశీలించిన డీఈ


టంగుటూరులో రోడ్లను పరిశీలిస్తున్న డీఈ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు

రాజుపాలెం, జూలై 23 : గత ప్రభుత్వంలో సీసీ రోడ్లు వేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి నాగరాజు ఫిర్యాదు చేయడంతో సోమవారం డీఈ లక్ష్మీనారాయణరెడ్డి గ్రామంలోని బీసీ కాలనీ, సచివాలయం, అర్కటవేములలోని మెటల్ రోడ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రొద్దుటూరు శాసనసభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి కూడా గ్రామాల్లో సీసీ రోడ్లు వేసేందకు ప్రతిపాదనలు అడిగారని, దాంతో గ్రామాల్లో పర్యటించి అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల ఏర్పాటుకు ఎస్టిమేట్లు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జ్ ఏఈ నరేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లాయపల్లె భూములు పేదలకు చెందాలి


నల్లాయపల్లె భూములు పేదలకు చెందాలంటూ డిమాండ్ చేస్తున్న కార్మిక సంఘాలు

అట్లూరు, జూలై 23 : మండలంలోని నల్లాయపల్లె భూములు పేదలకు చెందాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపాధ్యక్షులు అన్వేష్, వెంకటేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు భూములను పరిశీలించారు. సర్వే నెం.40లోని 450 ఎకరాల ప్రభుత్వ భూములను స్థానికేతరులు ఆక్రమించి మామిడి, జామాయిల్ చెట్లు నాటి కంచెలు వేశారని, ఆ భూముల్లో రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమలకూరు, వలసపాలెం, కాటంవారిపల్లెకు చెందిన భూములు లేని నిరుపేదలు పాల్గొన్నారు.

ఇంటి స్థలం పరిశీలన


గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దారు ఉమారాణి

చాపాడు, జూలై 23: మండలంలోని విజయనగరం గ్రామంలో ముక్కమోళ్ల ఆదేలుకు చెందిన ఇంటి స్థలాన్ని ఇన్‌చార్జి తహసీల్దారు ఉమారాణి మంగళవారం పరిశీలించారు. తమ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారని ఆదేలు కుమారుడు జర్నియా ఈ నెల 22న స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో తహసీల్దారు ఉమారాణి, ఆర్ఐ ప్రమీల వారి రికార్డులను పరిశీలించారు. 12 సెంట్ల స్థలానికి సరైన ఆధారాలు లేవని, తహసీల్దారు చెప్పారు. కేవలం వారి వద్ద అగ్రిమెంటు మాత్రమే ఉందని, దానిలో సర్వే నంబరు కూడా రాయలేదని, పొడవు, వెడల్పులు లేవని చెప్పారు. ఆ స్థలం రిజిస్టర్ కానందున అగ్రిమెంట్ చెల్లదన్నారు. తహసీల్దారు గ్రామస్థులతో కూడా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఎన్నికల పారితోషికం చెల్లించాలి


ఎన్నికల డీటీ అజయ్‌బాబుతో మాట్లాడుతున్న ఎన్జీవో అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23: ఎన్నికల విధులు నిర్వహించిన సచివాలయ ఉద్యోగులకు వెంటనే పారితోషికం చెల్లించాలని ఎన్జీవో అసోసియేషన్ ప్రొద్దుటూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య కోరారు. మంగళవారం ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు అజయ్‌బాబుతో సచివాలయ ఉద్యోగుల ఎన్నికల బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు మూడు నెలలపాటు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారని, వారికి రావాల్సిన పారితోషికాన్ని ఎందుకు చెల్లించడంలేదని ప్రశ్నించారు. అనంతరం ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు అజయ్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన నిధులకన్నా ఎక్కువ మొత్తం ఖర్చు అయిందని తెలిపారు. అదనంగా రూ.89 లక్షల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామని, రాగానే బీఎల్‌వోలు, వీఆర్వోలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీవో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివరామానుజ, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రభంజన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరి నాగార్జున, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 23: దివ్యాంగులకు రిజర్వేషన్లు వద్దని ఐఏఎస్ అధికారి స్మితసబర్వాల్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏపీ మదర్ థెరీస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్‌హుస్సేన్ డిమాండ్ చేశారు. శరీరాకృతి, తెలివితేటలకు సంబంధం లేదని, దివ్యాంగులకు రిజర్వేషన్లు వద్దన్న వ్యాఖ్యలు ఆమె స్థాయికి తగదన్నారు. సరైన అవకాశాలు రాక విద్యావంతులైన దివ్యాంగులు కూడా నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. దివ్యాంగుల పేరుతో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందుతున్నవారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆమె తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని కోరారు.